RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం | 07.15.2024

సంపుటి 327 | సంచిక 1 | పేజీలు : 03 | వెల : రూ.5



## తలుపులు తెరుచుకున్న రత్న భాండాగారం

దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా

**పూరీ ఆలయానికి గుర్తింపు**

పూరీ ఆలయంలోని రహస్య గదిని తెరిచిన ఒడిశా ప్రభుత్వం

పూరీ ఆలయంలోని రత్న భాండాగారంపై సర్వత్రా ఆసక్తి

లెక్కింపు చేపట్టనున్న 16 మంది సభ్యుల కమిటీ

02

# గౌడన్నలకు 'కాటమయ్య రక్షణ కవచం'

- తాటిచెట్లపై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోకుండా ప్రత్యేక సేఫ్టీ మోకులు
- పౌరుషానికి, పోరాటానికి మారుపేరు గౌడన్నలు
- కుల వృత్తులకు చేయూత అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- "కాటమయ్య రక్షణ కవచం" పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కుల వృత్తులకు చేయూతనందిస్తాం. బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని 'కాటమయ్య రక్షణ కవచం' పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కుల వృత్తులు,చేతి వృత్తుల వారికి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని అన్నారు. ఆనాడు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని గౌడన్నలు ఎంతో ప్రచారం చేశారని పేర్కొన్నారు.**



**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు**

కల్లు గీత కార్మికుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇక నుంచి ఎవరూ చెట్టుపై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ప్రత్యేక కిట్లను తయారు చేసింది. కాటమయ్య రక్షణ కవచం పేరిట 6 పరికరాలున్న కిట్ ను సిద్ధం చేసింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ తాటివనంలో 'కాటమయ్య రక్షణ కవచం' పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. గౌడ సోదరులకు స్వయంగా సిఎం రేవంత్ రెడ్డి కిట్లను అందజేశారు. గీత కార్మికుల భద్రత కోసం హైదరాబాద్ ఐఐటీ వారు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన కాటమయ్య సేఫ్టీ కిట్స్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గౌడన్నలకు లాంఛనంగా పంపిణీ చేశారు. వీటి పనితీరు గురించి అడిగి తెలుసుకుని, ప్రయోగాత్మకంగా పరిశీలించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఎం వెంట శాసన సభాపతి గడ్డం ప్రసాద్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, దయానంద్, ఎగ్గె మల్లేశం, ఎవిఎన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, జిల్లా కలెక్టర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతు.. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే బలహీనవర్గాల గౌరవం పెరుగుతుందని గుర్తించిన గౌడన్నలు ఎన్నికల్లో తమకు అనుకూలంగా ప్రచారం చేశారని అన్నారు. పౌరుషానికి, పోరాటానికి మారుపేరైన గౌడన్నలకు ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని భరోసా కల్పించారు. గౌడ సోదరుల భద్రత కోసమే ఈ రక్షణ కవచాలను అందిస్తున్నామని అన్నారు. ఎవరెస్టు ఎక్కిన వారి అనుభవం గౌడన్నల భద్రతకు ఉపయోగపడిందన్న సభాముఖంగా వారిని అభినందించారు. వృత్తి నిర్వహణ సమయంలో గౌడన్నలు ప్రమాదాల బారిన పడకుండా ఈ సేఫ్టీ కిట్ ఉపయోగపడుతుందని తెలిపారు. గౌడన్నల కుల వృత్తిని ప్రభుత్వం కాపాడుతుందని, వారి అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. దివంగత నేత వైఎస్ఆర్ హయాంలో బలహీనవర్గాల కోసం ఫీజు రీయింబర్స్ మెంట్ తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేస్తూ, ఫీజు రీయింబర్స్ మెంట్ ను ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం కూడా కంకణబద్ధమై ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో తాటి, ఈత చెట్లు పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న వన మహోత్సవంలో భాగంగా తాటి, ఈత చెట్ల పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తన వెంట ఉన్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు లకు సూచించారు. చెరువు గట్లపై కూడా ఈత చెట్లు నాటేలా ఇరిగేషన్ విభాగంతో మాట్లాడాలని అన్నారు. రహదారులు, చెరువుగట్లు, కాలువగట్ల వద్ద తాటి, ఈత చెట్లు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కులవృత్తులపై ఆధారపడిన వారందరు పిల్లలను

మిగతా 2లో

# మేడిగడ్డ వద్ద 40 వేల క్యూసెక్కులు

## కాళేశ్వరంనీటితో చెరువులు, కుంటలు నింపాలి

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట ప్రభాత సూర్యుడు** ప్రభుత్వం బేషజాలకు పోకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకొచ్చి చెరువులు, కుంటలు నింపాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. మేడిగడ్డ వద్ద 40 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నదని చెప్పారు. బ్యారేజీ గేట్లు తెరిచి ఉన్నప్పటికీ గోదావరిలో ఉన్న నీటి ప్రవాహానికి అనుగుణంగా నాలుగు మోటార్లు నడిపించుకునే అవకాశం ఉందన్నారు. ఆషాఢ బోనాల సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మహంకాళి అమ్మవారిని హరీశ్ రావు దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, రైతులంతా కళ్లల్లో ఒత్తులు వేసుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు.


# గెలిచిన ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి



- రేవంత్ ఏడు నెలల పాలనలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

వివరాలు3లో...

## అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పై కాల్పులు



- ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తుండగా దుండగులు ట్రంప్ పై కాల్పులు
- ట్రంప్ ప్రసంగిస్తుండగా ఒక్కసారిగా వరసగా తుపాకీ కాల్పుల శబ్దాలు
- ట్రంప్ కుడి చెవిని చీల్చుకొని వెళ్లిన బుల్లెట్లు
- హుటాహుటిన స్టేజిపైకి అమెరికా సీక్రెట్ సర్వీస్ సిబ్బంది
- దుండగుడిని కాల్చిచంపిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు

వివరాలు2లో...






## రేవంత్ సర్కార్ రేపిన

# రికవరీ రచ్చ

## మొన్న రైతుబంధు.. నిన్న పెన్షన్ రికవరీ

**అనర్హులను ఎంపిక చేసిన అధికారులపైనా చర్యలుండినా ?**

**బడా బాబుల సంగతేంటంటూ నిలదీత**

**గుబులు రేపుతున్న ప్రభుత్వ వైఖరి**

వివరాలు2లో...

# చరిత్ర సృష్టించిన ప్రధాని మోదీ

## ఏకంగా 100 మిలియన్ల ఎక్స్ ఫాలోవర్లు

**ఢిల్లీ ప్రభాత సూర్యుడు** నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ప్రధాని మోదీ మరో చరిత్ర సృష్టించారు. ఆయన ఎక్స్ ఖాతాను(@narendramodi) అనుసరిస్తున్న వారి సంఖ్య తాజాగా 100 మిలియన్లకు చేరింది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన నేతల్లో మోదీ అగ్ర స్థానంలో నిలవగా.. ఎక్స్ ద్వారా ఆయన మరో రికార్డు నెలకొల్పారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన నెలకొల్పిన తొలి రికార్డ్ ఇదే. చాలా మంది రాజకీయ నాయకులకు సోషల్ మీడియాలో ఫాలోయింగ్ ఉన్నప్పటికీ, మోదీ వారందరికీ అందనంత ఎత్తులో ఉన్నారు. లోక్ సభ విపక్ష నేత రాహుల్ గాంధీకి ఎక్స్‌లో 26.4 మిలియన్లు, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు 27.5 మిలియన్లు, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌కు 19.9 మిలియన్లు, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి 7.4 మిలియన్లు, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు 6.3 మిలియన్లు, తేజస్వి యాదవ్‌కు 5.2 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉండగా, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు 2.9 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (38.1), పోప్ ఫ్రాన్సిస్(18.5) ఫాలోవర్లు ఉన్నారు. ఇక మోదీకి యూట్యూబ్‌లో 25 మిలియన్లు,




ఇన్‌స్టాగ్రామ్‌లో 91 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. ఆయన 2009లో సోషల్ మీడియాలోకి ఎంట్రీ ఇచ్చారు. అప్పటి నుంచి రాజకీయాలు, సందేశాత్మక పోస్టులు చేస్తూ నెటిజన్లను ఆకట్టుకున్నారు. ఆకర్షణీయమైన పోస్టులను ఆయన రీపోస్ట్ చేస్తారు. సాధారణ పౌరులను కూడా అనుసరిస్తారు. వారి సందేహాలను తీరుస్తారు. పెయిడ్ ప్రమోషన్లు, బాట్‌లను ఆయన ఎప్పుడూ ఆశ్రయించలేదు. ఎవరినీ బ్లాక్ చేయలేదు. బీజేపీ వరుసగా మూడో సారి గెలవడానికి సోషల్ మీడియా కూడా ఒక కారణమే. ఇందులో మోదీ సోషల్ మీడియా అకౌంట్లు కీలకంగా వ్యవహరించాయి.

# గౌడన్నలకు 'కాటమయ్య రక్షణ కవచం'

**మొదటిపేజీ తరువాయి..**

ఉన్నత చదువులు చదివించి ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో వారు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. చేతి వృత్తులు, కులవృత్తులపై ఆధారపడ్డ కుటుంబాలకు చెందిన పిల్లలు చట్టాలు రూపొందించే స్థాయికి ఎదగాలని అభిలషించారు. బలహీన వర్గాలు పాలకులుగా మారాలంటే అందుకు ఏకైక మార్గం చదువు మాత్రమేనని స్పష్టం చేశారు.

కాగా, త్వరలోనే హయత్ నగర్ కు మెట్రో రాబోతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన అన్ని ప్రణాళికలు పూర్తయ్యాయని అన్నారు. ఫార్మా కంపెనీల కోసం సేకరించిన భూమిలో వివిధ యూనివర్సిటీలను, మెడికల్, టూరిజం, పరిశ్రమలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. న్యూయార్క్ సిటీతో పోటీ పడేలా మహేశ్వరంలో ఒక అద్భుతమైన నగరం నిర్మించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. ఊటీ కంటే అద్భుతమైన రాచకొండ ప్రాంతాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీకి అణువుగా మార్చబోతున్నామని అన్నారు. రంగారెడ్డి జిల్లాకు మహర్దశ రాబోతోందని, ప్రపంచంలోనే అద్భుతమైన పర్యాటక



కేంద్రంగా ఈ జిల్లాను తీర్చిదిద్దుతామని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఔటర్ రింగ్ రోడ్, ఫార్మా ఇండస్ట్రీ, అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ లు వచ్చాయని అన్నారు. మరో పదేళ్లు రాష్ట్రంలో తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేదిక ఆవరణలో ముఖ్యమంత్రి ఈత మొక్కలు నాటారు. గౌడన్నలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బి.సి.వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఆర్డీఓ అనంత్ రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, గౌడ కులస్తులు, పాల్గొన్నారు.తర్వాత విడుదల వారీగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కల్లుగీత కార్మికులందరికి కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాటమయ్య రక్షణ కవచం కిట్ల డెమో ప్రదర్శనను తిలకించి ఐదుగురు కార్మికులకు కిట్లు పంపిణీ చేసి గౌడన్నలతో సమావేశంలో మాట్లాడుతున్నారు. అందరితో కలసి భోజనం చేశారు. బీసీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో గత 15 రోజులుగా 50 మందితో ఆ కిట్లపై లష్కర్‌గూడలో ట్రయల్ రన్ నిర్వహించారు. రంగారెడ్డి కలెక్టర్ శశాంక వాటిని స్వయంగా పరిశీలించారు.

## తలుపులు తెరుచుకున్న రత్న భాండాగారం

**ఒడిస్సా ప్రభాత సూర్యుడు** దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన పూరీ జగన్నాథ ఆలయంలో రహస్య గది (రత్న భాండాగారం) తెరుచుకుంది. ఒడిశా ప్రభుత్వం ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటలకు ప్రత్యేక పూజల నిర్వహించి ఈ రహస్య గదిని తెరిచింది. ఈ మేరకు రాష్ట్ర సీఎస్ ఓ ప్రకటనలో తెలిపారు. జస్టిస్ బిశ్వనాథ్ రథ్ నేతృత్వంలోని 16 మంది సభ్యుల కమిటీ ఈ రత్న భాండాగారంలోని సంపదను లెక్కించనుంది. 46 ఏళ్ల తర్వాత పూరీ జగన్నాథ ఆలయంలో రహస్య గది తలుపులు తెరుచుకోవడం, నిధి లెక్కింపుపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. గతంలో కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయంలో నిధిపై ఇదే రీతిలో ఉత్కంఠ నెలకొనడం తెలిసిందే. కాగా, పూరీ ఆలయంలో జగన్నాథుడి సేవలకు అంతరాయం కలగకుండా, ఈ రహస్య గదిని తెరిచారు. ఈ పూరీ క్షేత్రంలో జగన్నాథునికి నిత్యం 119 మూలికా సేవలు జరుగుతాయి. వీటిని నిర్ణీత వేళల్లో సేవాయత్‌లు చేపడతారు. ఇక ఈ సేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా రత్న భాండాగారాన్ని తెరిచారు. ఇక రత్న భాండాగారంలోని ఆభరణాల లెక్కింపు ప్రక్రియ మొత్తం డిజిటలైజేషన్ చేయనున్నారు.ప్రస్తుతం పూరీ క్షేత్రంలో రథయాత్ర జరుగుతోంది. ఈ నెల 19 వ తేదీ వరకు జగన్నాథ, బలభద్ర, సుభద్రలు ఆలయం బయట ఉండనున్నారు. దేవుడు లేని సమయంలో అధికారులు ఆ రహస్య గదిని తెరిచి లెక్కింపు చేపట్టారు. అయితే వాటిని లెక్కించేందుకు ఎన్ని రోజులు పడుతుంది అనేది మాత్రం ప్రస్తుతానికి ఎలాంటి స్పష్టత లేదు. ఇక ఆ రత్న భాండాగారం.. లోపల విషసర్పాలు ఉంటాయన్న వార్తల నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు.. స్నేక్ హెల్ప్‌లైన్ నిపుణులు, అత్యవసర వైద్యానికి డాక్టర్లను కూడా అందులోకి పంపించినట్లు తెలుస్తోంది. చివరిసారిగా 1978లో ఈ రత్న భాండాగారాన్ని తెరిచారు. అప్పట్లో 70 రోజుల పాటు అందులోని సంపదను లెక్కించారు.

### తలుపులు తెరవగానే స్పృహ తప్పిన జిల్లా ఎస్పీ



పూరీ జగన్నాథుడి ఆలయంలోని రత్న భాండాగారం తలుపులు ఎట్టకేలకు ఆదివారం మధ్యాహ్నం తెరుచుకున్నాయి. అయితే తలుపులను తెరవగానే పూరి జిల్లా ఎస్పీ పినాక్ మిశ్రా గదిలో సొమ్మసిల్లి పడిపోయారు. దాంతో ఆయనను ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపుకు తరలించారు. అక్కడ డాక్టర్ సీబీకే మహంతి ఆయనకు చికిత్స అందిస్తున్నారు. ఎస్పీ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

సుప్రీం కోర్టుకు

## కెసిఆర్ విద్యుత్ కమిషన్‌ను రద్దు చేయాలని పిటిషన్



**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం నియమించిన విద్యుత్ కమిషన్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్ కమిషన్‌ను రద్దు చేయాలని గతంలో కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌నుతెలంగాణ హైకోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. రేపు సీజేఐ చంద్రచూడ్ ధర్మాసనం ముందు కేసు విచారణ జరగనున్నది. కాగా.. తెలంగాణలో జరిగిన విద్యుత్తు ఒప్పందాలపై జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కమిషన్ నియమించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కమిషన్ మాజీ సీఎం కేసీఆర్‌కు రెండోసార్లు నోటీసులు పంపించింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో కేసీఆర్ పాత్రపై కమిషన్ వివరణ కోరింది. తనను విచారణకు పిలవకూడదంటూ కేసీఆర్ తెలంగాణ హై కోర్టును ఆశ్రయించారు. అయితే గులాబీ బాస్‌కు న్యాయస్థానంలో చుక్కెదురైంది. కేసీఆర్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

## అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పై కాల్పులు

**పెన్సిల్వేనియా ప్రభాత సూర్యుడు** అమెరికా మాజీ అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ పై కాల్పులు జరిగాయి. పెన్సిల్వేనియా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తుండగా దుండగులు ఆయనపై కాల్పులు జరిపారు. ట్రంప్ ప్రసంగిస్తుండగా ఒక్కసారిగా వరసగా తుపాకీ కాల్పుల శబ్దాలు రావడంతో వెంటనే అప్రమత్తమైన ట్రంప్ తనను తాను కాపాడుకునేందుకు పోడియం క్రిందకు వంగి ఆత్మ రక్షణ ప్రయత్నం చేసారు. అప్పటికే బుల్లెట్ ట్రంప్ చెవిని చీల్చుకొని వెళ్లడంతో రక్త స్రావమైంది. వెంటనే అప్రమత్తమైన అమెరికా సీక్రెట్ సర్వీస్ కమాండోలు డోనాల్డ్ ట్రంప్ ను చుట్టుముట్టి రక్షణ వలయంగా ఏర్పడి కాపాడారు. ముఖం మీద రక్తంతో కనిపించిన ట్రంప్‌ను అమెరికా సీక్రెట్ సర్వీస్ సిబ్బంది హుటాహుటిన స్టేజ్ మీద నుంచి కిందికి తీసుకొచ్చి అంబులెన్స్‌లోకి చేర్చారు. ట్రంప్‌ను స్టేజ్ మీద నుంచి కిందికి తీసుకువస్తుండగా ఆయన చెవి దగ్గర, చెంపల మీద రక్తం కారుతుండటం కనిపించింది. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, క్షేమంగానే ఉన్నారని రిపబ్లికన్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనలో కాల్పులు జరిపిన వ్యక్తి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పుల్లో మరణించారు. సభకు హాజరైన వారిలో ఓ వ్యక్తి దుండగుడి కాల్పుల్లో మరణించారని, మరో ఇద్దరు గాయపడ్డారని సీక్రెట్ సర్వీస్ ఏజెన్సీ ప్రకటించింది. ట్రంప్‌పై కాల్పులను అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ సహా పలు దేశాల అధినేతలు ఖండించారు.

**ఎవరేమన్నారంటే..**

ఈ తరహా హింసకు అమెరికాలో చోటు లేదని, దేశమంతా ఇలాంటి ఘటనలను ముక్తకంఠంతో ఖండించాలని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఎక్స్ లో చేసిన ఒక ప్రకటనలో అన్నారు. పెన్సిల్వేనియాలో ట్రంప్ పై జరిగిన దాడి గురించి వివరాలు



తెలుసుకున్నాను. ట్రంప్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. వెంటనే స్పందించిన సీక్రెట్ సర్వీస్ ఏజెన్సీకి కృతజ్ఞతలు తెలిపారు. ట్రంప్ క్షేమంగా ఉండటంతో తాను ఊపిరి పీల్చుకున్నానని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అన్నారు. ''మేం ఆయన కోసం, ఈ ఘటనలో మరణించిన, గాయపడిన వ్యక్తుల కుటుంబాల కోసం ప్రార్థనలు చేస్తున్నాం. ఈ దేశంలో హింసకు తావులేదు. ఇలాంటి దుశ్చర్యలను అందరూ ఖండించాలి.'' అని హారిస్ ఒక ప్రకటనలో అన్నారు. ''వెంటనే స్పందించినందుకు సీక్రెట్ సర్వీస్ డిపార్ట్‌మెంట్‌కు, ఇతర అధికారులకు కృతజ్ఞతలు. నా దేశం కోసం నేను ప్రార్థిస్తూనే ఉంటాను. ఐ లవ్యూ డాడ్, టుడే అండ్ ఆల్వేస్'' అంటూ ట్రంప్ కూతురు ఇవాంకా ట్రంప్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పెన్సిల్వేనియాలో తన తండ్రిపై జరిగిన దాడి దుండగుల తెలివితక్కువ పనిగా ఆమె అభివర్ణించారు.

### ఖండించిన ప్రధాని నరేంద్ర మోదీ

ట్రంప్‌పై కాల్పుల ఘటనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఖండించారు. ఎక్స్‌లో ఆయన స్పందిస్తూ ... ''నా స్నేహితుడు, మాజీ అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్‌పై దాడి నన్ను తీవ్రంగా కలచివేసింది. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాను. రాజకీయాలు, ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు. ఆయన తొందరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను'' అని రాశారు.

### డోనల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం విచారకరం: రాహుల్ గాంధీ

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం విచారకరమని, ఇలాంటి ఘటనలను అందరూ ఖండించాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ట్రంప్ త్వరగా కోలుకోవాలంటూ ఎక్స్ లో చేసిన ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.

## డీఎస్సీ రద్దు కుదరదు..



**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు:** కేసిఆర్ ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగ , యువతీ యువకులకు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం తెచ్చుకుంది ఉద్యోగాలకోసమని తెలిపారు. అనేక ఉద్యమాలు, విద్యార్థుల ఆత్మబలిదానాల ఫలితం తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని చెప్పారు. అందుకే తమ ప్రభుత్వం ఉద్యోగాలపై దృష్టి పెట్టి 30వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని వెల్లడించారు. విద్యా వ్యవస్థ బలోపేతం, పేద విద్యార్థులకు మంచి విద్యానందించాలని డీఎస్సీ ప్రకటించామని తెలిపారు. ఈరోజు( ఆదివారం) గాంధీభవన్‌లో భట్టివిక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. పదేళ్లు డీఎస్సీని ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ విడుదల చేసి ఓట్లకోసం తాపాత్రయ పడ్డారని విమర్శించారు. 5వేల నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించకపోవడంతో తమ ప్రభుత్వం రాగానే 11వేలకు పైగా పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చామని గుర్తుచేశారు. 16వేల టీచర్ పోస్టులుఖాళీగా ఉన్నట్టు గుర్తించామని, 19,718 టీచర్ల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టామని వివరించారు. ఇప్పటికే అభ్యర్థులు హాల్ టికెట్లు 2లక్షల 500కు పైగా డౌన్ లోడ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం 2లక్షల 79వేలమంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కొంతమంది పోస్ట్‌పోన్ చేయమని ధర్నాలు చేస్తున్నారని అలా చేయడం తగదని దీనివల్ల అభ్యర్థులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాగానే గ్రూప్ 1పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించి రిజల్ట్ ప్రకటించామని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో నిరుద్యోగ యువకులు నష్టపోయిన విషయాన్ని గుర్తించామని అన్నారు. గ్రూప్ 2 కూడా గత ప్రభుత్వం మూడు సార్లు పోస్ట్ ఫోన్ చేసిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం మళ్లీ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. గ్రూప్ 3 కూడా నిర్వహించలేకపోతే మళ్లీ తాము షెడ్యూల్ చేశామని అన్నారు. ఇవన్నీ నిరుద్యోగులకు నష్టం కలగొద్దని తమ ప్రయత్నమని వివరించారు. ఇవి కాక వివిధ శాఖల్లో పోస్టులు 13321 టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్నామని తెలిపారు. డీఎస్సీని కూడా పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. మరో డీఎస్సీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు.త్వరలోనే పోస్టుల సంఖ్యతో నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించారు. అందరూ మంచిగా ప్రిపేరై ఉద్యోగాలు సాధించి విద్యార్థులకు మంచి విద్యను అందించాలని కోరుతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు..

# రేవంత్ సర్కార్ రేపిన రికవరీ రచ్చ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

గత బీఆరెస్ ప్రభుత్వంలో సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో జరిగిన అక్రమాల నిగ్గు తేల్చేందుకు విచారణ కమిషన్ల ఏర్పాటుతో ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అనూహ్యంగా పథకాల లబ్ధిదారుల నుంచి కూడా రికవరీ చర్యలకు పూనుకుంటున్న తీరు హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా వ్యవసాయేతర భూమికి రైతుబంధు సహాయం పొందిన వ్యక్తి నుంచి డబ్బుల రికవరీకి నోటీసులిచ్చిన ప్రభుత్వం, అక్రమంగా ఆసరా పెన్షన్ పొందారంటూ ఒంటరి వృద్ధ మహిళ నుంచి కూడా పెన్షన్ మొత్తాన్ని రికవరీకి ఆదేశించడం సంచలనంగా మారింది. ఘట్‌కేసర్ మండలం పోచారం గ్రామంలో మోత్కుపల్లి యాదగిరిరెడ్డికి సంబంధించి 30ఎకరాల వ్యవసాయ భూమికి 16.80లక్షల రైతుబంధు పంపిణీ కాగా, దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అధికారులు రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద లబ్ధిదారుడికి నోటీసులిచ్చారు. ఇదే తరహాలో రాష్ట్రంలో 12విడతల్లో పంపిణీ జరిగిన 80,458 కోట్ల రైతుబంధులో సాగులో లేని కొండలు, రోడ్లు, లేఅవుట్లు ఉన్న భూములకు 25,672కోట్లు ఇచ్చినట్లుగా అధికార యంత్రాంగం గుర్తించింది. వేలకోట్ల ప్రజాధనం దుర్వినియోగం వివరాలు పరిశీలిస్తే.. ఈ లెక్కన అనర్హుల జాబితా చాంతాడంత




ఉండనుంది. అందులో బడా లియల్టర్లు, పారిశ్రామికవేత్తలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ మంత్రులు సైతం ఉన్నారు. మరి వారందరి నుంచి రైతుబంధు నిధుల రికవరీ సాధ్యమా అంటే అసాధ్యమేనంటున్నారు నిపుణులు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 80ఏళ్ల పక్షపాత వ్యాధిగ్రస్తురాలైన ఒంటరి వృద్ధ మహిళ దాసరి మల్లమ్మకు ఆసరా పెన్షన్ కింద వచ్చిన రూ. 1,72,928లను తిరిగి కట్టాలని అధికారులు నోటీసులిచ్చారు. ఈ వ్యవహారం సైతం రాజకీయంగా దూమారం రేపింది. ప్రతిపక్ష బీఆరెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇదే అదనుగా ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. పెన్షన్ 4వేలకు పెంచుతామని చెప్పి ఇచ్చిన పెన్షన్‌ను రికవరీ చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. అయితే మల్లమ్మ పెన్షన్ రికవరీ వివాదంలో బీఆరెస్ పార్టీ రాజకీయ విమర్శలు చేస్తుందంటూ కాంగ్రెస్ విరుచుకపడుతున్నది. మల్లమ్మ



కూతురు ఆరోగ్య శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ చనిపోవడంతో డిపెండెంట్ పెన్షన్ అందుతున్నదని, మరో వైపు వృద్ధాప్య పింఛన్ కూడా వస్తున్నదని, అందుకే అధికారులు చర్యలకు ఉపక్రమించారని సమర్థించుకుంటున్నారు.

**రికవరీ తెగే లెక్కేనా?**

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో అనర్హులైన లబ్ధిదారుల నుంచి సొమ్ము రికవరీ ప్రక్రియ అంత సులభతరం కాదంటున్నారు విశ్లేషకులు. ఇలాంటి చర్యలు ప్రజల మధ్య పరస్పర ఫిర్యాదులకు, తగవులకు కారణమవుతాయన్న వాదన కూడా బలంగానే వినిపిస్తున్నది. రాజకీయంగా తమకు గిట్టని కుటుంబాల లబ్ధిదారులపై ఏదో ఒక అనర్హత అంశం లేవనెత్తి వివాదం సృష్టించే అవకాశాలు ఇప్పటికే సాగుతున్నాయి. అదీగాక రికవరీ చర్యలు నిస్సహాయులు, పేదలు, సామాన్యులకే పరిమితమయ్యే ప్రక్రియ తప్ప సమాజంలో పలుకుబడి కలిగిన వ్యక్తుల వరకు వచ్చేసరికి సాధ్యంకాని ప్రహసనంగా మిగిలిపోతుంటుంది. అలాంటప్పుడు ప్రభుత్వ యంత్రాంగం చేసే రికవరీ చర్యలు సమాజంలో తిరుగుబాటుకు ఆజ్యం పోయడంతోపాటు అధికార పార్టీకి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని ప్రోది చేసే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. దుర్వినియోగమైన, పక్కదారి పట్టిన ప్రభుత్వ సొమ్మును అనర్హులైన లబ్ధిదారుల నుంచి రికవరీ చేయాలంటే పలు ప్రభుత్వ పథకాల్లో అలాంటి లబ్ధిదారుల జాబితా అంతులేని జాబితాను తలపించకతప్పదు. రైతుబంధు, దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, గొర్రెల స్కీమ్ , గతంలో ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఆసరా పెన్షన్లు, తెల్లరేషన్ కార్డులలో లక్షల మంది అనర్హులు ఇప్పటికే ఉన్నారన్న వాదన మొదటి నుంచీ వినిపిస్తునే ఉంది. సంక్షేమ పథకాల వరకే రికవరీ చర్యలు పరిమితం కాకుండా ప్రభుత్వ భూములను అక్రమంగా పొందిన వారి నుంచి, ప్రాజెక్టులు, ప్రభుత్వ ఒప్పందాలలో జరిగిన అవకతవకలకు సంబంధించిన వివాదాల్లో సైతం రికవరీ చర్యలు చేపడితే ప్రజల నుంచి పాలకుల దాకా రికవరీ ప్రక్రియ రానుంది. అలాంటప్పుడు రికవరీ వ్యవహారం జోలికెళ్లి కొరివితో తలగోక్కోవడం ఎందుకన్న వాదన రాజకీయ వర్గాల్లో సాగుతున్నది. రాజకీయం, అధికార సాధన ప్రక్రియ అంతా ఉచిత పథకాలు, సంక్షేమ పథకాల చుట్టే సాగుతున్న మన వ్యవస్థలో రికవరీ వంటి సెల్ఫ్‌గోల్ చర్యలకు పోకుండా అనర్హులను జాబితా నుంచి తొలగించడం.. కొత్త లబ్ధిదారుల ఎంపికలో అనర్హులు ఉండకుండా చూడటమే శరణ్యమంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

### అనర్హులపై చర్యలుంటే.. అధికారులపై ఎందుకుండవు?

రైతుబంధు, ఆసరా పెన్షన్ రికవరీ వివాదాల్లో ఇంతకాలం లబ్ధిదారుల అనర్హతను గుర్తించని ప్రభుత్వ అధికారుల పనితీరు చర్చనీయాశంగా మారింది. అనర్హత కారణంగా లబ్ధిదారుల నుంచి ప్రభుత్వ సొమ్ము రికవరీ చేసినప్పుడు అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోరా? అన్నది ఆసక్తికరంగా మారింది. స్థానిక రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబితాలో స్థానిక అధికారులు విధి లేక అనర్హులను అక్కడక్కడ ఎంపిక చేస్తుంటారు. అయితే రికవరీ వివాదం నేపథ్యంలో అనర్హులైన లబ్ధిదారులపై చర్యలుంటే.. అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు ఎందుకుండవన్న ప్రశ్న రేకేత్తుతున్నది. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు ఇవ్వమంటే ముప్పతిప్పలు పెట్టే అధికార గణం.. ఇచ్చినవాళ్ళకి రెండు పెన్షన్లు ఇచ్చిన తీరుపై చర్యలెందుకు తీసుకోరన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. లబ్ధిదారుడికి అందిన సొమ్ము రికవరీలో సగం సొమ్మును బాధ్యులైన అధికారుల నుంచి వసూలు చేస్తారా? లేక శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా? అన్నది తేలాల్సివుంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# పటాన్ చెరువు మైత్రి క్లబ్ అధ్యక్షుడిగా మళ్లీ పట్లోళ్లనే

**సంగారెడ్డి ప్రభాత సూర్యుడు**

తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పటాన్ చెరువు మైత్రి క్రికెట్ క్లబ్ కార్యనిర్వాహక కమిటీ ఎన్నికలు ఆదివారం మైత్రి క్లబ్లో జరిగినట్లు ఎన్నికల నిర్వహకులు జిహెచ్ఎంసి అప్రూవల్ సివిల్ ఇంజనీర్ పివి రమణ మరియు మాజీ ఎమ్ ఆర్ ఓ సహదేవులు తెలిపారు. ప్రభాత సూర్యుడు ప్రత్యేక ప్రతినిధితో వారి ఇరువురు మాట్లాడుతూ అధ్యక్షుడు ఎన్నికల్లో చర్చోప చర్చలు జరిగాయని అన్నారు. అయినప్పటికీ వరుసగా ఆరవసారి పట్లోళ్ల హనుమంత్ రెడ్డిని తిరిగి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గత ఐదు పర్యాయాలు పట్లోళ్ల హనుమంత్ రెడ్డి మైత్రి క్లబ్ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని అన్నారు. మైత్రి క్రికెట్ క్లబ్ తరఫున క్రీడాకారులకు, క్రీడా అభిమానులకు ఉత్సాహాన్ని నింపుతూ అంతరాష్ట్ర మరియు అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు నిర్వహించడంలో పట్లోళ్ల హనుమంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని అన్నారు. దక్షిణ భారత రైల్వే ఉద్యోగిగా ఉంటూ రైల్వే శాఖకు సేవలు అందిస్తూ మిగిలిన సంపూర్తి సమయాన్ని మైత్రి క్రికెట్ మైదానానికి కేటాయించి స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో మైత్రి భవన నిర్మాణానికి ఎంతగానో తోడ్పడ్డారని పివి రమణ అన్నారు. వేల కోట్ల రూపాయల మైత్రి మైదానాన్ని క్లబ్బు సభ్యుల సహకారంతో భూ బకాసురుల కబంధహస్తాల నుండి కాపాడారని అన్నారు. అందుకే పట్లోళ్ల హనుమంత్ రెడ్డిని సభ్యులందరూ మూకుమ్మడిగా మైత్రి క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని అన్నారు. జనరల్ సెక్రటరీ ఎన్నికల్లో ఐదు ఓట్ల తేడాతో జి రవీందర్ గిరి ఎన్నికైనట్లు తెలిపారు. రవీందర్ గిరి సైతం తుల్జాపూర్ మాత అమ్మవారి భక్తుడిగా అమ్మవారికి సేవలందిస్తూ మరొకవైపు మైత్రి క్రికెట్ క్లబ్ కు సేవలు అందించడమే కాకుండా స్థానిక ఏషియన్ పెయింట్ కంపెనీ ఉద్యోగిగా స్వచ్ఛంద పదవి విరమణ చేసి క్లబ్ అభివృద్ధికి సేవలు అందిస్తూ అందరినీ కలుపుకుపోతూ జనరల్ సెక్రటరీగా అందరి మన్నలను పొందాలని అన్నారు. ఉపాధ్యక్షుడిగా కే రాజు, జాయింట్ సెక్రటరీగా ఇషాక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా, సుమన్ ట్రెజరరీగా, ఎన్ శ్రీనివాస్ ఎన్నికైనట్లు తెలిపారు. ఈసారి జరిగిన కార్యనిర్వాహక ఎన్నికల్లో ఎన్నికైన సభ్యులందరూ సమన్వయంతో పటాన్ చెరువు మైత్రి క్రికెట్ క్లబ్ అభివృద్ధికి తోడ్పడనున్నారని క్లబ్ సభ్యులమందరము ఆశిస్తున్నామని పివి రమణ మరియు సహదేవులు అన్నారు.



పటాన్ చెరువు మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా 6 సారీ ఎన్నికైన పట్లోళ్ల హనుమంత్ రెడ్డి



మైత్రి క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రెటరీగా నాల్గవసారి ఎన్నికైన జి రవీందర్ గిరి

## తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్ గా సుమన్



**హైద్రాబాద్ ప్రభాత సూర్యుడు**

తెలంగాణ రాష్ట్రానికి హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్ ఎస్.సుమన్ ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ఎస్.సుమన్ హైదరాబాద్కు చెందినవారు,హైదరాబాద్లో గ్రాడ్యుయేషన్,పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. గత 18 సంవత్సరల నుండి హైకోర్ట్ లో నాయావాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. తెలంగాణ అత్యున్నత న్యాయస్థానం అడ్వకేట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా పని చేసారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డికి,అదనపు అడ్వకేట్ జనరల్ టి.రజనీకాంత్ రెడ్డికి,తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.నాగేశ్వర్ రావుకి,అతని సహచరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



## సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

**అబ్దుల్లాపూర్ మెట్ ప్రభాత సూర్యుడు**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ లష్కర్ గూడ గ్రామంలో నిర్వహించిన 'కాటమయ్య రక్షణ కవచం' పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కొంత గందరగోళం చోటుచేసుకుంది. గౌడ కులస్తులకు సేఫ్టీ కిట్ల పంపిణీ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తుండగా మధ్యాహ్న భోజన కార్మికులు మండల సీపీఎం నాయకులతో కలిసి ఆందోళన చేసారు. సీఎంను కలిసి వినతి పత్రాన్ని ఇవ్వడానికి వచ్చిన మధ్యాహ్న భోజన పథకం సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న, సిఐటియు జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహాలను పోలీసులు కలవనివ్వక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన వారు నినాదాలు చేస్తూ ఆందోళన చేసారు. అప్రమత్తమైన పోలీసులు సిపిఎం నాయకులను, కార్మికులను చెదరకొట్టే ప్రయత్నం చేసారు. అది గమనించి వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి వారిని ఏమనొద్దని, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు వారి వద్దకు వెళ్లి కార్మికుల డిమాండ్లను పరిశీలించాలని ఆదేశించారు. అయినా వారు ససేమిరా అనడంతో కొంత గందరగోళం చేటుచేసుకుంది. ముఖ్యమంత్రి వెళ్ళిపోయినా తర్వాత స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వారి వద్దకు వచ్చి వినతి పత్రాన్ని స్వీకరించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథక రాష్ట్ర నాయకురాలు ఎల్లమొని సప్న, సిఐటియు ఏర్పుల నరసింహా, పోషమని కృష్ణ, ఎల్లయ్య, గణేష్, జిల్లా నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మమ్మ, నిర్మలమ్మ రమాదేవి, రంగమ్మ, పుష్ప, స్వరూప, రాజమణి నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావు చాల మంచి నాయకుడు



**-కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**

**కరీంనగర్ ప్రభాత సూర్యుడు**

తెలంగాణలో రాజకీయాలు రోజు రోజుకు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఓవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా ఒక్కొక్కరిగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటున్నారు. ఇప్పటికే 9 మంది ఎమ్మెల్యేలు అధికారికంగా కాంగ్రెస్ గూటికి చేరుకోగా, మరికొంత మంది సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి వచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నారని.. కానీ అలా వచ్చే ఎమ్మెల్యేలు కచ్చితంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే రావాలంటూ షరతు పెట్టటంతో వెనకాడుతున్నారని కమలనాథులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావుపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్లో నిర్వహించిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు మంచి నాయకుడని.. ప్రజల మనిషి అని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడాడని, ప్రజల కోసం ఆరాటపడే వ్యక్తి అంటూ ప్రశంసించారు. బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు ఒక్కడే మంచి నేత అన్నారు. కేసీఆర్, కేటీఆర్, కవిత.. ఆ కుటుంబ సభ్యులందరిపై అవినీతి ఆరోపణలున్నాయని.. కానీ హరీష్ రావు ఒక్కడే వివాదరహిత నేతల అంటూ కొనియాడారు. "ఇలా చెప్తున్నా అంటే.. హరీశ్ రావును నేను ఫోన్ చేశాననో, మాట్లాడాననో.. ఆయన బీజేపీలోకి వస్తున్నారనో.. అర్థం కాదు. ఆయనపై నాకున్న అభిప్రాయాన్ని చెప్తున్నా.. అంతే." అంటూ బండి సంజయ్ వెంటనే క్లారిటీ ఇచ్చారు. అయితే.. హరీష్ రావు బీజేపీలోకి రావాలన్నా.. ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సిందేనని బండి సంజయ్ చెప్పుకొచ్చారు. ఎలాగూ హరీష్ రావుకు జనాధరణ బాగానే ఉంది కాబట్టి ఆయన సులువుగానే గెలుస్తాడని.. బండి సంజయ్ చెప్పుకొచ్చారు.

## హైదరాబాద్ లో బోనాల సంబరాలు



**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**

భాగ్యనగరంలో ఆషాడ మాసబోనాలు మహా నగరంలో ఆదివారం కన్నుల పండుగగా కొనసాగాయి. సిటీలో గల్లీగల్లీలు ఆధ్యా త్మిక శోభను సంతరించుకున్నాయి.. ఈనెల 7వ తేదీన గోల్కొండ జగ దాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. గోల్కొండ జగదాం బికా అమ్మవారికి బోనం సమర్పించడానికి మహిళలు పెద్ద యెత్తున తరలి వస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్త కుండా గోల్కొండ కోట కింద పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# గెలిచిన ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి

- రేవంత్ ఏడు నెలల పాలనలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలి
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**

ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్న తరుణంలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో అవసరమైతే వాయిదా తీర్మానంతో అసెంబ్లీను స్తంభింపజేసేందుకు కూడా వెనుకాడమని హెచ్చరించారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేదాకా వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి రాజకీయం నిరుద్యోగం తీర్చుకోవడానికి, నాడు రాష్ట్రంలోని యువతను రెచ్చగొట్టారని బీఆర్ఎస్ కార్యనిర్వహక



అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. నిరుద్యోగ యువకులు, విద్యార్థులపై ముఖ్యమంత్రి చేసిన వాఖ్యలపై ఆయన మండిపడ్డారు. నిరుద్యోగుల కోసం పోరాటం చేస్తున్న వారి గురించి చేసిన వ్యాఖ్యలను, సీఎం ఉపసంహారించుకోవాలని హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోనందునే, నేడు ప్రభుత్వంపై తెలంగాణ యువత భగ్గుమంటోందని తెల్చిచెప్పారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, నిరుద్యోగ యువతకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ అన్నారు. అలాగే గ్రూప్2, గ్రూప్3 ఉద్యోగాల సంఖ్య పెంచాలని కోరారు. అసెంబ్లీని స్తంభింపజేసేందుకు కూడా వెనుకాడం ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్న తరుణంలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. అవసరమైతే వాయిదా తీర్మానంతో శాసనసభను స్తంభింపజేసేందుకు కూడా వెనుకాడమని హెచ్చరించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగేదాకా వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. "నిరుద్యోగుల విషయంలో ఇంత దారుణంగా మాట్లాడిన ముఖ్యమంత్రి ఇంకెవరూ లేరు. ఎన్నో ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తాదని చెప్పి, ఏ యువతైతే మమ్మల్ని దించి, కాంగ్రెస్ పార్టీని గద్దెనెక్కించిందో ఈరోజు అదే యువత మిమ్మల్ని ప్రశ్నిస్తున్నది. రేవంత్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఇంకా మిగిలిన నెలల్లో ఏవిధంగా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తారని ప్రశ్నిచారు.

## ఆహ్వానం లేకుండా అంబానీ పెళ్లికొచ్చారు



**ముంబై ప్రభాత సూర్యుడు**

అనంత్ అంబానీ, రాధిక మర్చంట్లు పెళ్లికి ఇద్దరువ్యక్తులు ఆహ్వానం లేకుండా వెళ్లారు. వారిపైముంబై పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకితీసుకున్నారు. వారిలో ఒకరు యూట్యూబర్ వెంకటేష్నరసయ్య అల్లూరి (26) కాగా, లుక్మాన్ మహ్మద్షఫీ (28) అనే వ్యక్తి. తనను తాను వ్యాపారవేత్తగాప్రకటించుకున్నారు. ఏపీ నుంచి పెళ్లికి వచ్చినట్లువారు చెప్పారు. వారికి నోటీసులిచ్చిన అనంతరంపోలీసులు విడుదల చేశారు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.783/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR501 505, RANGAREDDY DIST/ HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.783/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215